క్లుప్తంగా

హోటళ్లలో తనిఖీలు.. జరిమానా



హోటళ్లలో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

పుత్తూరు: పట్టణంలోని పలు హోటళ్లలో బుధవారం పురపాలక సంఘ ప్రజారోగ్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అపరిశుభ్రంగా ఆహార పదార్థాలు కలిగిన హోటళ్లకు జరిమానాలు విధించారు. రంజాన్ రెస్టారెంట్‌కు రూ.1000, మా రెస్టారెంట్‌కు రూ.500, లియో రెస్టారెంట్‌కు రూ.800 చొప్పున జరిమానాలు విధించినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శ్రీనివాస్‌బాబు, మునస్వామి, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్నింటా రాణించాలి



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

వెదురుకుప్పం: దివ్యాంగులు అన్నింటా రాణించాలని ఎంఈఓ దామోదరం అన్నారు. బుధవారం మండలంలోని పచ్చికాపల్లం భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వికలత్వం శరీరానికే గానీ మనస్సుకు కాదన్నారు. ప్రభుత్వ పథకాలు, సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని అందరిలాగే అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఐఈఆర్టీ ఉపాధ్యాయురాలు శ్యామల మాట్లాడారు. దివ్యాంగులకు రవాణా భత్యం, స్టైపండ్‌తో పాటు ఎస్కార్ట్ అలవెన్సులను ప్రభుత్వం బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. వికలత్వం ఉన్న పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ సేవలు పొందాలని కోరారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్సీ ప్రధానోపాధ్యాయులు సిద్ధయ్య, ఉపాధ్యాయులు భువనేశ్వరి, పద్మశ్రీ, రాజశేఖర్, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు గుణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం



వైద్య పరీక్షలు చేయిస్తున్న డాక్టర్ ప్రవీణ్

పాలసముద్రం: పిల్లల్లో రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఎంతగానో దోహదపడతాయని వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. బుధవారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి ఆయన మాట్లాడారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, అలాగే గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని, ప్రసవం ప్రభుత్వ ఆస్పత్రిలో చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఏఎన్‌ఎం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

• నివాళి



నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ నేత వై.కుమారస్వామిరెడ్డి అన్నారు. పుత్తూరు మండలం గొల్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవేంద్రరెడ్డి తల్లి నారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఇది తెలుసుకున్న కుమారస్వామిరెడ్డి బుధవారం ఆ గ్రామానికి వెళ్లి నారాయణమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఐరాల విద్యార్థులకు పతకాలు

ఐరాల: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించినట్లు బుధవారం పాఠశాల హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో గత నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-19 ఫెన్సింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి పతకాలు సాధించారని పేర్కొన్నారు. టీమ్ ఈవెంట్ సాబార్ విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆసియా బంగారు పతకం, లోకేష్ రజత పతకం సాధించారని తెలిపారు. ఈపీఈఈ విభాగంలో దినేష్‌రెడ్డి, గణేష్ రజత పతకాలు, మైథిలి, మొగిలీశ్వరి కాంస్య పతకాలు సాధించి పాఠశాలకు మంచి పేరు, ప్రఖ్యాతులు తెచ్చారు.



కళ్యాణపురం లేఔట్‌లోని ఇళ్ల నిర్మాణాలు

పేదల ఇళ్లపై కూటమి కక్ష

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేసింది. ప్రతి పేద కుటుంబానికి ఇంటి పట్టా ఇచ్చి, ఇళ్లు నిర్మించింది. దీంతో కొత్త కొత్త కాలనీలు, ఊర్లు వెలిశాయి. సగానికి పైగా గృహప్రవేశాలు చేసిన పేదలు తమ కలలను సాకారం చేసుకున్నారు. మిగిలిన సగం వివిధ దశల్లో పనులు జరుగుతూ వచ్చాయి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లను ప్రోత్సహించడం లేదు. వసతుల విషయాన్ని పట్టించుకోవడమే లేదు. దీంతో పేదల ఇళ్ల నిర్మాణాలు ప్రశ్నార్థకంగా మారింది.

- కాంట్రాక్టర్లను ప్రోత్సహించని ప్రభుత్వం
- మౌలిక వసతుల గురించి పట్టించుకోని వైనం
- ప్రశ్నార్థకంగా ఇళ్ల నిర్మాణం

పుత్తూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల్లో ఒకటైన పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన ప్రతి పేదలందరికీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. ఊరూరా అందుబాటులో ఉన్న ఖరీదైన స్థలాలను కొనుగోలు చేసిమరీ లేఔట్లు వేసి, ఇళ్ల నిర్మాణాలను పూనుకుంది. ఒక్క పుత్తూరు మండలంలోనే 15 లేఔట్లు వేసి 1,896 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. ఇందులో 1,388 మందికి ఒక్కొక్కరికి రూ.1.80 లక్షల చొప్పున ఇంటి నిర్మాణాలను మంజూరు చేసింది. వివిధ దశలను బట్టి నగదును అందజేసేవారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి అవసరమైన వారికి మహిళా సంఘాల ద్వారా రూ.35 వేల చొప్పున రుణాలను సైతం మంజూరు చేసింది. ఇలా 689 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

పుత్తూరులో ఇళ్ల నిర్మాణాల వివరాలు

పరిధి	లేఔట్లు	ఇచ్చిన పట్టాలు	మంజూరైన ఇళ్లు	పూర్తైన నిర్మాణాలు
పుత్తూరు అర్బన్	3	1,313	935	406
పుత్తూరు రూరల్	12	583	453	283
మొత్తం	15	1,896	1,388	689

కూటమి ప్రభుత్వం రాకతో పనులకు బ్రేక్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాలను పట్టించుకున్న పాపాన పోలేదు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయో, రావో అనే అనుమానంతో కాంట్రాక్టర్లు పనులకు స్వస్తి పలికారు. దీంతో పేదల సొంతింటి కల సాకారం కాని పరిస్థితి. ఇక మౌలిక వసతుల పరిస్థితి సరేసరి. పుత్తూరు పట్టణ పరిధిలోని చెర్లోపల్లి లేఔట్ వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు దుస్థితికి చేరింది. కనీసం మోటర్ సైకిళ్లు సైతం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఇక్కడకి ఇళ్ల నిర్మాణాల సామగ్రి చేరవేయడం గగనంగా మారిందని లబ్ధిదారులు వాపోతున్నారు. పనులు ఆగిపోవడంతో లేఔట్లలో పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణాల ఊసే ఎత్తకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా కాంట్రాక్టర్లకు, లబ్ధిదారులకు బిల్లులు చెల్లించి పనులు ప్రారంభించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



చెర్లోపల్లె లేఔట్ ఇళ్ల మధ్య పిచ్చిమొక్కలు



చెర్లోపల్లె లేఔట్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి



బిల్లు కోసం వేచి చూస్తున్నా

మోల్డింగ్ పనులు పూర్తయ్యాయి. పూత పని, కిటికీల ఏర్పాటు చేయాల్సి ఉంది. బిల్లు పడితే పనులు ప్రారంభించాలని వేచి చూస్తున్నా. లేఔట్‌లో ఈ చివరన ఒకటి, ఆ చివరన ఒక స్ట్రీట్ లైట్ మాత్రమే ఉంది. రాత్రుల్లో భయం..భయంగా ఉంటోంది. స్ట్రీట్ లైట్లతో పాటు డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

– ఎ.అల్లిమ్మ, ఎన్టీఆర్ కాలనీ, పుత్తూరు.



వసతులు కల్పించండి

లేఔట్‌లో వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే డ్రైనేజీలు, రోడ్లు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం పనులు ఆగిపోయిన చోట పిచ్చి మొక్కలు పెరిగిపోయి, పాములు చేరుతున్నాయి. పనులు ప్రారంభమయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.ఈశ్వరి, ముద్దుకృష్ణాపురం, పుత్తూరు.

బిల్లులు ఆగే పరిస్థితి లేదు

ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు ఆగే పరిస్థితి లేదు. కాంట్రాక్టర్లే పనులు ఆపేసి ఉన్నారు. సొంతంగా నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు సైతం పనులు ఆపేసి ఉన్నారు. 'మన ఇల్లు-మన గౌరవం' పేరిట గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం. మౌలిక వసతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఆగిన అన్ని నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేస్తాం.

– వి.సురేంద్ర, హౌసింగ్ ఏఈఈ, పుత్తూరు

ప్రతి కేసూ ఆరోగ్యశ్రీలో నమోదు



రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్

నగరి: ఆస్పత్రికి వచ్చే ప్రతి కేసునూ ఆరోగ్యశ్రీలో నమోదు చేయాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి ఆదేశించారు. బుధవారం నగరి ఏరియా ఆస్పత్రిని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ కేసులు, డెలివరీ కేసులు, ల్యాబ్ రిపోర్టులు పరిశీలించారు. బ్లడ్ బ్యాంక్ నిర్వహణను తనిఖీ చేశారు. అనంతరం వైద్యులతో సమావేశమై మాట్లాడారు. ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేయడం తగ్గించి ఆస్పత్రిలోనే రోగులకు వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా, ఆర్ఎంఓ ఆర్‌వీ మంజుల, వైద్యులు కార్తికేయన్, ప్రవీణ, ఉష, లోకేష్, జయంత్, మోనిక, జ్యోత్స్న పాల్గొన్నారు.

పంటల పరిశీలన



రైతులకు సలహాలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వరదయ్యపాళెం : వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం తిరుపతికి చెందిన శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ టి.ప్రతిమ, డాక్టర్ సరళ, డాక్టర్ కె.దేవకి, హేమలత నియోజకవర్గంలోని పిచ్చాటూరు, కేవీబీపురం మండలాల్లో పర్యటించారు. రామాపురం అప్పంబట్టు, ముడియూరు, కీళ్లపూడి, నీరువాయి, ఆరె గ్రామాల్లో నీట మునిగిన వేరుశనగ పంట, మినుము పంటలను పరిశీలించారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసంపై దళితుల ఆందోళన



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

– నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

శ్రీరంగరాజపురం : మండలంలో పాతపాళ్యం దళితవాడలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై దళిత సంఘ నేతలు ఆందోళన చేశారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి డి.గోవిందస్వామి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడం హేయమని ఖండించారు. ధ్వంసం చేసిన వారు ఎంతటివారైనా సరే పోలీసులు రాజకీయలకు అతీతంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ నెల 6వ తేది అంబేడ్కర్ వర్ధంతి రోజున మళ్లీ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత పీపుల్స్ రాష్ట్ర కార్యదర్శి గజేంద్రన్, దళిత నాయకులు చిన్నబ్బన్, మునస్వామి, సందీప్, తంగరాజ్, నరేష్, రాజ్‌కుమార్, కరుణాకర్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

పుత్తూరు: రబీ సీజన్(2024-25)కు సంబంధించి పంటల బీమాకు రైతులే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో ఫసల్ బీమా యోజన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వేరుశనగ పంటకు డిసెంబర్ 15వ తేదీ లోపు, వరి పంటకు 31వ తేదీ లోపు నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో బీమా చేసుకోవాలని సూచించారు. వరి పంట ఎకరాకు రూ.630, వేరుశనగ ఎకరాకు రూ.450 ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కోదండయ్య, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి మునికమల్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఇన్సూరెన్స్ కరపత్రాలను చూపుతున్న ఏఓ కోదండయ్య

కొనసాగుతున్న మాజీ మంత్రి వితరణ



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు: పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా వితరణ కొనసాగుతోంది. ప్రతి బుధవారం ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు పౌష్టికాహారాన్ని కొన్నేళ్లుగా ×రోజా చారిటబుల్ ట్రస్ట్₹ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తుండటం విదితమే. ఇదే కోవలో బుధవారం గర్భిణులకు, వారి సహాయకులకు యధావిధిగా వెజిటబుల్ ఫలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రూ.43వేల జరిమానా



సోషల్ ఆడిట్ సిబ్బంది చెబుతున్న విషయాలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రవికుమార్

ఐరాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన 17వ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పలువురు సిబ్బందికి డ్వామా పీడీ రవికుమార్ జరిమానా విధించారు. మండలంలోని 28 పంచాయతీల్లో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, అటవీ శాఖ, హౌసింగ్ తదితర శాఖలకు సంబంధించి 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మొత్తం 2,242 పనులకు గానూ రూ.5 కోట్లు వ్యయం చేశారు. 2024 నవంబర్ నుంచి డిసెంబర్ 3 వరకు చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. తనిఖీలో గుర్తించిన విషయాలపై చర్చించేందుకు ప్రజావేదిక కార్యక్రమాన్ని డ్వామా పీడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో అక్కడక్కడా మామిడి మరికొన్ని ఇతర చెట్లు దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్త వాటిని నాటించని కారణంగా సిబ్బందికి రూ.43వేలు జరిమానా విధించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ వల్ల గ్రామీణ ప్రజలకు లభించే జీవనోపాధితో ఆర్థిక అభ్యున్నతిని మెరుగు పరుచుకోవాలన్నారు. చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పలు రకాల పండ్ల తోటల పెంపకం, భూమి చదును లాంటి ఎన్నో పనులకు అవకాశం ఉందని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, డీపీఓ శివయ్య, ఎస్‌టీఎం లోకేష్, ఏపీఓ సంధ్య, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు, వేతనదారులు, రైతులు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చేపట్టాలి

వడమాలపేట (విజయపురం): మిరప సాగులో బ్యాక్టీరియా తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటుందని, సరైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాస్త్రవేత్త పీఎస్ సుధాకర్ అన్నారు. వడమాలపేట మండలం చింతకాల్వలో బుధవారం ఏఓ విజయకుమార్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తుపాను మిరప సాగుపై అధిక ప్రభావం చూపవచ్చని, మిరప తోటలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మొదలు కుళ్లు, వేరు కుళ్లు తెగులు, ఎండు తెగులు ఆశించకుండా మొదళ్లను రిడోమిల్ 2గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపిన ద్రావణంతో బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అలాగే పంట కోలుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ప్రస్తుతం తుపాను కారణంగా వేరుశనగ పంట విత్తనం వాయిదా వేసుకోవాలని, అలాగే వేరుశనగ సాగుకు ముందు విత్తనాన్ని జీవ శిలీంధ్ర నాశిని ట్రైకోడెర్మా విరిడిని ఒక కిలో విత్తనానికి ఆరు గ్రాముల చొప్పున కలిపి విత్తుకోవాలని ఏవో విజయకుమార్ సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్, శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని..

శ్రీకాళహస్తి : శ్రీహరికోట నుంచి ప్రయోగించనున్న పీఎస్ఎల్‌వీ-సీ 59, ప్రోబా-3 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని బుధవారం ఉదయం షార్ అధికారులు శ్రీకాళహస్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. షార్ అధికారులు యశోద, ఎంఎస్ గుప్తా తదితరులు ముక్కంటి ఆలయానికి విచ్చేశారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్మార్ట్ లాక్ సిస్టమ్‌తో పటిష్ట భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మహేశ్వర్

నగరి : స్మార్ట్ లాక్ సిస్టమ్‌తో పటిష్ట భద్రత ఉంటుందని సీఐ మహేశ్వర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఈఓపీఆర్డీ, కార్యాలయ సిబ్బందికి స్మార్ట్ లాక్ సిస్టమ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం కల ఈ లాక్‌లను వాడితే ఇళ్లకు ఇతరులు, దొంగలు ఆ లాక్‌ను తెరవడానికి ప్రయత్నించినా, దాన్ని పగలగొట్టే ప్రయత్నం చేసినా అలారం మోగుతుందన్నారు. అలాగే పోలీసు శాఖ సూచించిన అత్యాధునిక కెమెరాలను ఇళ్లు, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాన్నారు. ఊరికి దూరంగా వైఫై సదుపాయం లేని ఇళ్లకు సోలార్ 4జి సిమ్, 4ఎంపీ పాన్, టిల్ట్ జూమ్ సదుపాయం ఉన్న సీసీ టీవీ కెమెరాలు వాడితే అది సిమ్ సపోర్టుతో పనిచేస్తుందన్నారు. వాటర్ ప్రూఫ్ సౌకర్యం ఉంటుందని రికార్డింగ్ చేసే అంశాలు స్పష్టంగా ఉంటాయన్నారు. ఈ పరిజ్ఞానంతో కార్లు, బైక్‌లలో కూడా కెమెరాలు వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, ఈఓపీఆర్‌డీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యత



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ పరిపాలనాధికారి

పాలసముద్రం: గ్రామాల్లో అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని చిత్తూరు జిల్లా పరిషత్ పరిపాలనాధికారి ఎస్ఎన్ అల్లి ఆదేశించారు. బుధవారం పాలసముద్రం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు.. ప్రజలకు ఉపయోగపడే పనులపై మాత్రమే ఖర్చు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ క్రిష్ణమహేష్ రెడ్డి, మండల పరిపాలనాధికారి మధువాణి, సీనియర్ అసిస్టెంట్ మల్లీశ్వరి, మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు పీపీఈ కిట్లు

చిత్తూరు అర్బన్ : నగరపాలక పరిధిలోని సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు పీపీఈ కిట్లను నగర మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్ పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం, నేషనల్ సఫారీ కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నమస్తే' కార్యక్రమంలో భాగంగా బుధవారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగరంలో గుర్తింపు పొందిన సెప్టిక్ ట్యాంక్ వర్కర్లకు పీపీఈ కిట్లు (రక్షణ పరికరాలు) పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ, విధులు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యాశాఖ నిర్ణయాలు అసంబద్ధం: యూటీఎఫ్

నగరి: విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయాలు అసంబద్ధంగా ఉన్నాయని యూటీఎఫ్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, పాఠశాలల పనివేళల పెంపు, 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు.. ఇలా ప్రతి నిర్ణయమూ అసంబద్ధంగానే ఉందని విమర్శించారు, మండలాల్లో 10 శాతం మంది ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదననడం శోచనీయమన్నారు. ఈ పరిస్థితుల్లో టీచర్లు ఎవరైనా అనారోగ్యం బారిన పడినా కూడా సెలవులు మంజూరు చేయకపోవడం చూస్తే ఎంత దారుణంగా ఉంటున్నాయో నిర్ణయాలని దుయ్యబట్టారు. ఇప్పటికే విద్యార్థులు అపార్ నమోదు విషయంలో పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఆదివారాలు, పండుగ దినాల్లో సైతం పనిచేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులపై ఉపాధ్యాయుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోందని చెప్పారు. వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓకు నమశ్శివాయకు వినతిపత్రం అందజేశారు.

విజయపురంలో..

విజయపురం: పాఠశాలల పని వేళల పెంపు సరికాదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్ ఆక్షేపించారు. విద్యాశాఖ తీసుకున్న నిర్ణయాలు అసంబద్ధంగా ఉన్నాయని నిరసిస్తూ బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో యూటీఎఫ్ నేతలు ఎంఈవో శ్యామలకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు స్కూళ్ల సమయం పెంచడం, 10 శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని ఆంక్షలు విధించడం సరికాదన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఆదివారం, పండుగ దినాల్లో సైతం పని చేయాలనడం ఎంతమాత్రమూ సరికాదన్నారు. అత్యవసర పరిస్థితిలో మండల విద్యాశాఖ అధికారులు సెలవులు మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని, విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఓ.వంశీకృష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.





విజయపురం: ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, నగరి: ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నేతలు